# నాంచారమ్మ

"ఏ పని చెప్పినా ఇంతే కదా! మీకు చెప్పేబదులు నేనే చేసుకుంటేనే నయం. ఈ కూరలు పశువులు తినడానికా మనం తినడానికా? పండు దొండకాయలు... ముదర బెండకాయలు. అయ్యయ్యో! ఈ వంకాయల నిండా గింజలు. కూర వండుతాను. తింటారో, మీ నెత్తిన రుద్దుకుంటారో ఏదో చెయ్యండి నాకు తెలీదు. నే నిక ఈ సంసారం చెయ్యలేను. ఓ ముద్దు ముచ్చటా లేదు. పైగా గొడ్డు చాకిరీ....."

కాసేపు నిశ్శబ్దం. మళ్ళీ "ఎంత కాలమై ముచ్చట పడుతున్నాను... ఆ సరోజ కొనుక్కుంది కాశ్మీర్ సిల్కు చీర. అలాటి దోటి కొనితెండి అని పోరితే ఆ నారచీర నా ముఖాన కొట్టేరు కట్టుకుని విహరించమని. అంతేలెండి. ఎవరికెంత రాసివుందో అంతే - అందరూ మనలాగే వుంటున్నారా? ఆకాంతం దాని మొగుడు, సాయంత్రం ఆయేసరికల్లా టింగురంగా అని చక్కర్లు కొడతారు - పోనీ, మీ తోటి గుమాస్తా చలపతి, వాడి పెళ్ళాన్ని చూడండి. మనకన్నా ఏమీ బావుకోటం లేదుకదా? పెళ్ళాం వెంట లేకుండ ఎక్కడికీ కదలడు. అలా విరగబడి పోతారు. ఈ చీని చీనాంబరాలు, రత్నాభరణాలతో నేను, మీ దివ్య సుందర విగ్రహాన్ని వెంటేసుక బయల్దేరుతే వెయ్యి కళ్ళుచాలవ్!"

ఇక్కడ భోరున ఏడుపు: "నా శని విరగడై పోతే చాలని మా అమ్మ, నాన్న మీకు కట్టబెట్టేరు - దానికి బదులు నే పుట్టినప్పుడే నా పీక నులిమి పారేసుంటే తీరిపోను".

ఏడుపు కూడా ఆగిపోయింది. గిన్నెలు, చెంబులు వంటింట్లోంచి ధన్ ధన్ మంటున్నాయి.

ఆ ఇంట్లో ఉదయమే చిన్న ప్రళయం ఆరంభమయింది. ఆ మాట లంటున్నది ఓ స్త్రీ మూర్తి అని పాఠకులు గ్రహించే ఉంటారు. ఆమె పేరు నాంచారమ్మ. నాంచారమ్మ అనగానే పాఠకులకు రూక్ష వీక్షణాలు, చెదిరిన జుత్తు, రెండు వందల పౌన్లు బరువు, ఓ అరడజను పిల్లలతో ఒక మధ్య వయస్కురాలు కళ్ళకు కట్టడం సహజం.

కాని అది పొరపాటు, ఈమె ఇరవై ఏళ్ళ అందమైన చిన్నది. ఎర్రగా, పొడుగ్గా, నాజూగ్గా ఉంటుంది. "ఈ ముఖంలోని అందం అంతా మాలోనే ఇముడ్చుకున్నాం. చూసేరా..." అని చాటేటట్టుండే పెద్దకళ్ళు.


వరదాచారి వీధి వరండాలో గోడ కానుకుని కూచున్నాడు. ఒడ్డూ పొడుగూ గల విగ్రహం. తలమీద ముందుసగం భాగం జుత్తు తీయించేశాడు. తక్కిన జుత్తు పొడుగ్గా పెంచి వెనక్కి ముడివేశాడు. నుదుట నామం పెట్టుకున్నాడు. ముఖంలో చురుకుదనం లేదు. కళ్ళు శాంత స్వభావాన్ని చాటుతున్నాయి. కొందరు మనుష్యుల్ని చూడగానే, వీడిచేత దమ్మిడీ ఖర్చు లేకుండా పనిచేయించుకోవచ్చు" నని పిస్తుంది. వరదాచారి ముఖం ఆ కోవకి చెందుతుంది. ఉతికిన పంచకట్టుకుని బనియన్ తొడుక్కున్నాడు. వయస్సు ముప్పై దగ్గర దగ్గర. కోమటి గుమాస్తా ఉద్యోగం.

ఇల్లు పూరిల్లు, మట్టి గోడలు, సిమ్మెంటు గచ్చు. ఇటు ప్రక్కదొక బ్రాహ్మణ కొంప. అటు ప్రక్కనొక సందు. ఆపక్కనే ఒక డ్రయివరు ఇల్లు. డ్రయివరు తెల్లవారు ఝామున పోయి ఏ రాత్రికో ఒస్తాడు. కొన్ని కొన్ని రాత్రులు లారీతో సహా పై ఊళ్ళో ఉండవలసి వస్తుంది. పడుచు పెళ్ళాం, పేరు రత్తి. నల్లగా ఉంటుంది. కాని మహ సొంపుగా నవ్వగలదు. ఎప్పుడూ నవ్వుతున్నట్టే ఉంటుందా ముఖం, మొగుడిచేత తాపులు తినేప్పుడు తప్ప. ఎదురుగా కోమట్ల ఇల్లు వుంది. దుకాణం ఇల్లు ఒకటే. ఆ ఇంట్లో దుఃఖానికి అంతు లేదు. రోజూ ఆ ఇంట్లో రాగాలాపన జరుగుతూనే వుంటుంది. ఎప్పుడో పోయిన తల్లికోసం, విధవ అక్కగారు, అందరూ పడుకునేవేళ చూసుకొని ఏడుపు లంకించుకుంటుంది. పిల్లల వస్తువు కాని, చిల్లర డబ్బులు కాని ఎక్కడన్నా పడిపోయినప్పుడు ఇంట్లో రాగాలు, పెడబొబ్బలూనూ.

వీళ్ళ ఇంట్లో దుఃఖం ఎలా ఆ వీధిలో అందరికీ చిరపరిచితమో, అలాగే నాంచారమ్మ కోపమూను. అది మామూలయి పోయింది. అందుకే ఉదయాన్నే ఆవిడ పెంకు లెగిరేటట్టు భర్త మీద విరుచుకుపడి కేకవేస్తున్నా రోడ్డున పోయే ఒక్కరూ అటు చూడడం లేదు. ఎవరిగొడవలు వాళ్ళ కున్నాయి. అదీకాక "ఈ ఇంటి లక్షణమే ఇంత" అనుకునే స్థితికి వచ్చేసింది వ్యవహారం.

వరదాచారి మౌనంగా కూర్చున్నాడు వీధిలో తిరుగాడే జనాన్ని చూస్తూ. దుకాణానికి పోయేందుకు మరోగంట సమయం ఉంది. ఈవిడ ఈ గొడవేదో తగ్గించి కాస్త వండి పడేస్తే నాలుగు మెతుకులు నోట్లో వేసుకోని కొట్టుకి పోతాడతను.

తన పెళ్ళయి మూడేళ్ళయింది. పెళ్ళయిన మొదటి ఆరు నెలలూ బాగానే గడిచింది. కాస్త పాతపడగానే ఏదో ఓ మిషమీద తప్పులెంచడం, అసంతృప్తి తెలియచెయ్యడంతో ఆరంభమై రాను రాను ఈ స్థితికి వచ్చింది. తను భార్యను ఒక్కనాడూ ఒక్క చెడుమాట అనలేదు. ఆమె కోరిక లేవో తను తీర్చగలిగినంత మట్టుకు తీర్చేడు. తనకు స్తోమత



లేనప్పుడు ఊరుకున్నాడు. అంతకన్నా తను మాత్రం ఏం చెయ్యగలడు ఏ భర్త మాత్రం ఏం చెయ్యగలడు? అయినా ఎందుకని ఇలా ప్రవర్తిస్తోందో తనకర్థం కాదు. తనని చూడగానే ఎందుకా రుస రుస? ఇంటి కెవరొచ్చినా వాళ్ళతో బాగానే మాట్లాడుతుందే!

రోజూ ఉదయాన్నే పంచాంగ చెప్పే తిరుపతి శాస్త్రి వీధంటపోతూ, వేగం తగ్గించి, ఆగుదామా వద్దా అని కాస్త తటపటాయించి అనుమానంగా ఆచారి దగ్గర కొచ్చేడు. లోనుంచి తుఫాను వీస్తోనే వుంది. అయినా శాస్త్రి గారు తడబడకుండా ఒక్క వెకిలి నవ్వు నవ్వి ప్రశ్నించారు. "ఏం ఆచారిగారూ! ఇంకా కొట్టుకి వేళ అవనట్టుంది" అని.

అదో అర్థం లేని ప్రశ్న. వేళయితే ఇంటి దగ్గరెందు కూర్చుంటాడు? అయినా ఆ ప్రశ్న వేస్తూనే ఉంటాడు శాస్త్రి.

వరదాచారి విరాగిలా ఒక చిరునవ్వు చిందించి ఊరుకున్నాడు.

శాస్త్రి ఆచారి వేపు జాలిగా చూశాడు. అతనికి ఇదొక అర్థం కాని సమస్య. చక్కని పిల్ల! మొగుడి కేమయినా తక్కువయిందా ఆ జుత్తు ముడివేసుకున్నాడే కాని క్రాపింగు పెట్టుకుని, సూటూ బూటూ వేసు కున్నాడంటే రాజు కొడుకులా ఉంటాడు. తిండికీ బట్టకీ లోపంలేదు. మరెందుకీ రాద్ధాంతం? ఈవిడెందుకిలా రోజూ నోరు పారేసుకుంటుంది? ఏమో! అంతా ఆ పరమాత్ముడికే తెలియాలి. ఇది కేవలం కర్మ ఫలం తప్ప వేరుకాదు అని నిశ్చయించుకున్నవాడై శాస్త్రి ఆచారి వేపు చెయ్యిచాచేడు. జేబులోంచి పొడుం డొక్కు తీసి ఆచారి శాస్త్రి చేతిలో పడేశాడు. శాస్త్రి ఒక పెద్ద పట్టు పట్టి, పొడుం డొక్కు తిరిగి అందించి ఏదో ప్రశ్నించ బోయి తమాయించుకొని లేచాడు.

"సరే మళ్ళీ కలుద్దాం" అన్నాడు ఆచారి తల ఊపాడు. పంచాంగంకట్ట పట్టుకొని శాస్త్రి నిష్క్రమించాడు.

నాంచారమ్మ నోరు ఇంకా ధాటిగానే వుంది. భర్త పుట్టింటి వారి నందరినీ ఒక దులుపు దులుపుతోంది.

ఆచారి మౌనంగా, శాంతంగా కూర్చున్నాడు. ఆ వాడలో ఉండే జనం అంతా ఎవరిపనులకి వారు పోగా వీధి నిర్మానుష్యంగా ఉంది. అదే సమయాన, ఎదురుగా వున్న కోమట్ల ఇంటికి బియ్యం కోసం వెళ్ళిన రత్తమ్మ తిరిగివస్తూ గోడకి చేరబడి కూచున్న ఆచారిని చూసి జాలిగా చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వు కామె బుగ్గలు సొట్టబోయేయి. బొద్దుగా, పొట్టిగా, నిగనిగలాడే రత్తమ్మ మహ సొంపుగా నవ్వింది. ఆ నవ్వుకి ఆమె కళ్ళు మెరిసేయి. మెరిసే కళ్ళు ఓ కొత్త అందాన్ని పుంజుకున్నాయి.

ఆచారి రత్తమ్మ కేసి చూసి తలదించుకున్నాడు. అతడి ముఖం ఎర్రబడింది.

నాంచారమ్మ అంటోంది. "ఈ సంసారం నే చెయ్యలేను. మీరేఖర్మాన

## వై. రఘునాధరావు

పోతారో పొండి. నేనదో నుయ్యో, గొయ్యో చూసుకుంటాను".

ఆచారి మెల్లిగా వంచిన తలపైకెత్తాడు. రత్తమ్మ ఆ జాగాలో అలా నిల్చుని మళ్ళీ ఆ జాలినవ్వే నవ్వింది. ఆచారి చరాలున లేచేడు. లేచి, విసవిస లోనికి వెళ్ళి భార్య ముఖం మీద పెట్టి అరిచేడు "ఆ చచ్చేదేదో వేగంగా చావరాదూ? ఒకరిపీడ ఒకరికి వదుల్తుంది".

నాంచారమ్మ బిక్క చచ్చిపోయింది. ఇన్నాళ్ళూ ఎదురు పలకి ఎరుగని ఈ మనిషికి ఇవాళ ఎక్కడిదీ ధైర్యం? ఇతనికి పిచ్చికాని ఎత్త లేదు కదా! ఆమె తమాయించుకొని అంది.

"ఔను, నా పీడ ఎప్పుడు విరగడౌతుందా అనే కదూ చూస్తున్నారు? నాకు తెలుసు లెండి. నే ఛస్తే ఒక ముష్కరాలిని కట్టుకొని ఊరేగుదామని చూస్తున్నట్లుంది. నే నివాళ చెబుతున్నాను వినండి నా ఖర్మ కాలి నేను మిమ్మల్ని చేసుకున్నాను కాని మీలో ఏం చూసి ఆడది మిమ్మల్ని కట్టుకుంటుంది?"

ఆచారికి ఆవేశం ఎంత హఠాత్తుగా వచ్చిందో, అంత హఠాత్తుగా మళ్ళీ చల్లారి పోయింది. ఠాణాలో జమను ఎనిమిది గంటలు వేసేడు. ఇహ మకాణానికి పోవాలి ఇది ఇవాళ తిండి పెట్టదన్నమాట కల్ల. బనియనుమీద వదులు చేతుల లాల్చీ తొడుక్కొని ఓ తువ్వాలుగుడ్డ భుజాన వేసుకొని ఆచారి వీధిలోకి పోయేడు.

సాయంత్రం ఏడు గంటల కల్లా ఇంటికి చేరుకునే ఆచారి ఆ రోజు తొమ్మిదయినా రాలేదు. నాంచారమ్మకి అర్థం కాలేదు. ఇతగాడు మధ్యాహ్నం భోజనానికి కూడా రాలేదు. పోనీ అదెక్కడో తినేసేడనుకున్నా ఇంతవరకూ ఇంటికి రాక పోవడానికి ఏం కారణం?

ఇవాళ తన భర్త ప్రవర్తన తమాషాగా వుంది. తను ఏమన్నా, కుక్కిన పేనులా పడి వుండే మనిషికి ఆ వెర్రి కోపం ఎలా వచ్చింది? ఇంతవరకూ ఇంటికి కూడా రాలేదు. తన ప్రవర్తనలో ఏమన్నా తప్పు వుందా అని ఆలోచించిందామె. దివిటీ పెట్టి చూసినా ఎక్కడా తనలో కాని తన ప్రవర్తనలో కాని లోపం అగుపడలేదు. తప్పెప్పుడూ అతనిదే. కోరిక లుండడం తనదా తప్పు? ఓ మంచి చీర కొనుక్కోవాలని, ఈనాటికన్నా మెడలో ఓ గొలుసు వేసుకోవాలని కోరుకోడం తన తప్పు కాదు. అవి తీర్చలేకపోవడం అతనిది తప్పు. ఒక ముద్దూ ముచ్చటా లేదు. ప్రేమ ఒలకబోస్తే సరా? ఎందుకా చచ్చు ప్రేమ కబుర్లు, ఓ చిన్న కోరికన్నా తీర్చలేక పోయాక? ఒకనాడు పెళ్ళయిన కొత్తలో వీధంట మల్లెపూవులు పోతూంటె తను పిల్చింది. పువ్వులు పుచ్చుకొని రెండణా లివ్వమంది. అతను జేబులు తడుము కున్నాడు. డబ్బులు లేవు. తెల్లమొహం వేసుకొని 'రేపు రా అబ్బీ' అన్నాడు వాడు చేతిలోని పువ్వులు పుంజుకొని "డబ్బులిచ్చే మొహం లానే ఉంది" అంటూ పోయాడు. తనకు తల తీసేసినట్లయింది. ఆనక చిలక పలికినట్లు ఎంతో బాధ పడుతున్నానన్నారు. ఎవరిక్కావాలా కబుర్లు? పోనీ ఆ జుత్తు పెంచి క్రాఫింగ్ పెట్టుకోమని శతపోరినా వినరు. ఆ వేషమూ అతనూ! అతని వెంట వీధిలోకి వెళ్ళడానికే చచ్చే సిగ్గు వేస్తుంది.

ఒక వ్యవహారమూ సవ్యంగా నడవదు ఇతనితో. ఏమన్నా అంటే తనునోరు పెట్టుకొస్తున్నానని అందరూ అంటారు. డొక్కుల్లా మొహాలు, మొహాల నిండా మొటిమలు, కొండల మెడల్లా మెడలు వీళ్లా మహా అందగత్తెలమని విరగబడిపోతూ స్నోలూ, పౌడర్లూ పులిమేసుకొని అలా అలా చీరలు కట్టేసుకొని మొగుళ్ళ వెంట "నన్ను చూడు నా అందం చూడు" అని తిరిగేస్తూ ఉంటారే!

మరి తనబతుకేం ఇలా బుగ్గయింది? తనకేం అందానికి లోపమా. తనలాటి అందకత్తె నూటికీ కోటికీ ఒకర్తి అద్దంలో తన కళ్ళని చూసుకుంటే తనకే ముచ్చట వేస్తుంది.


"ఇదంతా నా ఖర్మ" అనుకుంది నాంచారమ్మ.

నాంచారమ్మ ఏమన్నా వరదాచారి పట్టించుకోడం లేదిప్పుడు. వండి పడేస్తే తిని పోతున్నాడు. కానీ వేళ పట్టున ఇంటికి చేరుకోడంలేదు. పది పదకొండు, ఒకప్పుడు రెండో ఆట వదిలేక ఇల్లు చేరుకుంటున్నాడు. "సత్రం భోజనం మఠం నిద్ర" అన్నట్టుంది పద్ధతి. నిలదీసి అడుగుతే దుకాణం మీద పని అంటాడు. సినీమాకు పోయేనంటాడు. ఎక్కడో కబుర్లు చెప్పుకుంటూ వుండిపోయా నంటాడు. రాను రాను నాంచారమ్మకి అలవాటయిపోయింది. ఇతడి పద్ధతి ఆమె కూడా పట్టించుకోడం లేదు. "ఎందుకింత ఆలస్యమయింది?" అని అడగడం కూడా మానేసింది.


కనిపించిన తల మాసినోడినల్లా నోరు తెరిచి
చప్పుడుగా అంటే తల తీసేసినట్టుంటుందనుకో...

కాని చాకలాడు రేవు పెట్టినప్పుడు వారానికో, పదిరోజులకో ఓసారి, ఓ దులుపు దులిపేయడం మాత్రం మానలేదు. రాను రానువాళ్ళిద్దరి మధ్యా కేవలం "నీవు నన్ను కట్టేవు కనుక నీతో ఉండక తప్పదు మరి. ఏం చేస్తాం? ఒక ఇంటి కప్పుకింద ఉండాలి కనుక ఉంటున్నాం" అన్న పరిస్థితి ఏర్పడింది.

ఆవేళ సాయంత్రం పక్కింటి సరోజ ఆదరా బాదరాగా వచ్చి "వదినా, కొం



దగ్గర ఇవాళ హరికథ ఉంది తెలుసునా... రుక్మిణీ కళ్యాణం" అంది.

"తెలుసు" అంది నాంచారమ్మ ముభావంగా.

"అయితే ఇంకా ఇలాగే ఉన్నావేం? వేళయింది భోజనం అదీ పూర్తి చేసుకో... వెడదాం"

"నేను రాను, నువెళ్ళు" అంది నాంచారమ్మ.

"ఏం? అన్నగారు రాలేదనా? మామూలేగా! తాళం వేసి పక్కింటి రత్తమ్మకివ్వు... పద వదినా" అంది లాలనగా సరోజ.

"తలనొప్పిగా ఉంది. ఒంట్లో బాగోటం లేదు, నువ్వెళ్ళు. నాకు ఈ హరికథలు నచ్చవ్," అంది నాంచారమ్మ.

సరోజ కాస్త తచ్చాడి వెళ్ళిపోయింది. సరోజ కిద్దరు పిల్లలు. నాంచారమ్మ ఈడుదే. ప్రతి సినీమాకి పిల్లల్ని వెంటేసుకు పోతుంది. ఊళ్ళో ఏ హరికథ జరిగినా పురాణ కాలక్షేపమైనా వెళుతుంది. మొగుడొచ్చి ఏవో నాలుగు మెతుకులు నోట్లో పడేసుకొని, ఏదో ఓ పుస్తకం చేతపుచ్చుకొని తొమ్మిదవగానే నిద్రలో వుంటాడు. భార్యకి సర్వ స్వాతంత్ర్యం ఇచ్చేసేడు. నాంచారమ్మకి వైవాహికంగా చాలా అన్యాయం జరిగిందని సరోజ అభిప్రాయం.

సరోజ వెళ్ళిపోయాక నాంచారమ్మ వంటపని పూర్తి చేసుకుంది. అప్పటి కప్పుడే రాత్రి ఎనిమిదయింది. తొమ్మిదయినా వరదాచారి రాలేదు. అది మామూలే. మొగుడికోసం కూచోక తన భోజనం ముగించి వీధిసావిడిలో కొచ్చి కూచుంది.

వెన్నెల మల్లెపువ్వులు పరజల్లినట్టుగా వుంది. దూరం నుంచి హరిదాసు గొంతు వినిపిస్తోంది. హరికథ ఇప్పుడే ఆరంభమయినట్టుంది. వీధి మలుపు తిరగ్గానే వుంది రామమందిరం. అక్కడెప్పుడూ ఏదో హడావుడి జరుగుతూనే వుంటుంది.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వీధి దీపాలు వెలగడం లేదు. వెన్నెల కనక. అంతా హరికథకి పోయినట్లుంది. ఏదేమయినా రత్తమ్మ మాత్రం ఇల్లు కదలదు. ఆ మొగుడు రక్తాలొచ్చేట్టు తన్నినా ఎందుకు భరిస్తుందో, తనే అయితే 'విజయమో వీరస్వర్గమో' అని ఏదో ఒకటి తేల్చేసి ఉండను. దాని మొగుడికి దానిమీద అనుమానం ఈ మగాళ్ళు మహా చిత్రమైన మనుష్యులు! రెండిళ్ళ తరువాత ఉన్న చాకలి బోడిగాడు ఇస్త్రీ వేస్తున్నట్టుంది. - ఇస్త్రీ పెట్టి చప్పుడవుతోంది.

నాంచారమ్మ ఆవులించింది. నిద్ర వచ్చినట్టు ఉంటుంది కాని, నిద్ర పట్టదు. పోనీ గోవెలకే పోయి గడియసేపు ఆ హరికథ విని వస్తే, ఇక్కడ బిక్కు బిక్కుమని కూచోడం తప్పుతుంది. ఆమె లేచి, వంట ఇంట్లోని సామాన్లు సర్ది, తలుపులు మూసి తాళం వేసింది. ప్రక్కన ఉన్న రెండిళ్ళలోనూ ఏదో ఓ ఇంట్లో తాళం చెవి ఇచ్చి వెళ్ళడం మామూలయింది. ఈ మధ్య తను ఎక్కడికి వెళ్ళినా, ఒక వేళ అతనొచ్చి నట్టయినా, తాళం చెవి పుచ్చుకొని అన్నం తిని గిన్నె లోమూల పారేసి పడుకుంటారు.

ఇరుగూ పొరుగూ హరికథకి పోయేరు. తాళం చెవి రత్తమ్మకే ఇవ్వాలి. రత్తమ్మ ఉంటున్న ఇల్లు రోడ్డు ముఖంగా లేదు. చిన్న సందుంది. ఆ సందు చివర ఉంది రత్తమ్మ ఇంటి ద్వారం.

'రత్తమ్మా!' తలుపులు తెరుచుకోగానే మత్తుగా మల్లెపూల సువాసన కొట్టింది. గాజుల గలగల చప్పుడు చేస్తూ తలుపు తీసింది రత్తమ్మ, తెల్లటి ఇస్త్రీ ఎర్రటి రవిక. ఇంట్లో హరికేన్ దీపం వెలుగుతోంది.

"ఎందుకిది ఇలా ముస్తాబయింది? మొగుడివాళ కాంపు నించి ఒస్తాడు కామోసు! ఆ మొగుడుమీద దీనికెందుకింత ప్రేమ? ఆ తాగుబోతు వాడిచేత నాలుగు తావులు తిన్నాక ముస్తాబు ఎత్తిపెట్టి ముసుగు తన్ని పడుకుంటుంది" అనుకుంది నాంచారమ్మ.

"హరికథకి వెళ్తున్నాను. ఈ తాళం చెవి ఉంచు... ఆయన ఒక వేళ వచ్చి అడుగుతే ఇయ్యి. "అలాగే" అంది రత్తమ్మ వయ్యారంగా తాళం చెవి అందుకుంది. చిరునవ్వు నవ్వింది. బుగ్గలు సొట్టలు పోయేయి. "సొంపుగా నవ్వడం మాత్రం దీనికి చాతనవును" అనుకుంది నాంచారమ్మ రామమందిరం వైపు బయలుదేరుతూ.

హరికథ ఆరంభమయి ఒక గంటయింది. స్త్రీల కేర్పాటు చేసిన చోట ఒక మూల కూర్చుంది నాంచారమ్మ. దాసుగారు చాలా హుషారుగా కథ చెప్పుకుపోతున్నాడు. చిలవలు పలవలు అల్లి రుక్మిణి కళ్యాణంలో రాకెట్లు, అణుశక్తి కూడా కలిపినట్టు కథలు చెప్తున్నారు. అన్ని వర్గాల వాళ్ళనీ తృప్తి పరచాలని మహా తాపత్రయపడుతున్నాడు.

నాంచారమ్మకి హరికథ పడదు. ఏదో వచ్చి కూచుంది కాని కథ మాత్రం వినడంలేదు. తన ఆలోచనలలో తానుండి. ఇందాక తలనొప్పిని అబద్ధ మాడిందికాని ఇప్పుడు నిజంగా తలనొప్పి వచ్చింది.

వెంటనే వెళ్ళి రత్తమ్మని తాళం చెవి అగుడుతే ఓ వెర్రి వెధవ నవ్వు నవ్వకుండా తాళం చెవి ఇవ్వదు, ఇదేనా నీ భక్తి! అన్నట్టు. కనక నాంచారమ్మకి కనీసం ఓ

గంటన్నా కూర్చోడం తప్పని సరైంది.

మరింక కూర్చోలేక పోయిందామె. తల నొప్పితో బాటు నిద్ర కూడా ముంచుకొస్తోంది. "హరికథ మాట దేముడెరుగును"! అనుకొని ఇంటి ముఖం పట్టింది నాంచారమ్మ.

దోవ నిర్మానుష్యంగా ఉంది వీధిలో రెండు మూడు కుక్కలు అదే పనిగా ఇటూ అటూ మహా హడావుడిగా తిరుగుతున్నాయి. ఎవరో ముసలాడి దగ్గు దూరంగా వినిపిస్తోంది. రత్తమ్మ ఇల్లు చేరుకుంది నాంచారమ్మ లోనుండి ఆమె మాటలు వినపడుతున్నాయి. దేనికో రత్తమ్మ ఫకాల్న నవ్వింది,కిలకిల నవ్వింది. ఆ నవ్వులో మొగవాసన కొట్టింది నాంచారమ్మకి. గడప ఎక్కి తలుపు తియ్యబోయిన నాంచారమ్మ చటుక్కున ఆగిపోయింది. తలుపు ఓరగా వేసి ఉంది. తలుపు పగుళ్ళోంచి దీపపు వెలుగు బయటికి చిమ్ముతోంది.

దీని మొగుడు కావి వేం చేసాడా ఏం? ఇది నవ్వుతోందే ఎప్పుడూ లేనిది! వాడెప్పుడూ దీనిక దేహశుద్ధి చెయ్యడమే తప్ప కులాసా కబుర్లు చెప్పడే! ఇవాళ వాడు తాగి ఉండకపోవచ్చు.

"ఏదీ నోరు ఆ... ఆగండి.. ఇంకా... అబ్బ! వేలు కొరికేసేరు.... అమ్మా! ఎంత కొంటెతనం.... మరొక చిలక తినండి... మరొకటి."

నాంచారమ్మ సందిగ్ధ స్థితిలో పడి పోయింది. నేరక హరికథనించి ఒచ్చేనే అనుకుంది. ఇప్పుడేం చెయ్యడం?... గడప దిగబోతూ ఉండగా....

"మీ ఆవిడ ఇలా ఎప్పుడన్నా మీ నోటి కందించిందా చిలకలు!" అన్నది లాలనగా రత్తమ్మ.

"ఆ! నాగవల్లి నాడు!" శిలా ప్రతిమలా వుండిపోయింది నాంచారమ్మ. రక్తమంతా ముఖానికెక్కి ముఖం ఎర్రబడింది. పెదవులు వణికేయి. ఆ గొంతు వరదాచారిది.

"ఓ వంద మంది ఆడవాళ్ళకిపంచగల అందం వుండి... ఎందుకు మగవాడి విలువ తెలియకపోయేక? ఏవంటారు?" రత్తి అంటోంది.

నాంచారి టక్కున వెనక్కి తిరిగి, గడపెక్కి దభల్ని తలుపు తోసుకుని గదిలోకి వెళ్ళింది.

వరదాచారి చిద్విలాసంగా మంచంమీద పడుకున్నాడు. విష్ణుమూర్తి ఆదిశేషువుమీద పవ్వళించి నట్టు. ఒక చెయ్యి తలక్రింద ఉంచుకొని, ఆ ముఖంలో ఒక వెలుగు, చెప్పనలవికాని తృప్తి, ఆనందం ఒక లిప్త మాత్రం చూడగలిగింది నాంచారమ్మ.

ప్రక్కన కూర్చొని తమలపాకుల ఈనెలు తీసి సున్నం రాసి చిలకలు చుట్టి నోటి కందిస్తోంది రత్తమ్మ.

వరదాచారి, రత్తమ్మ కొయ్యబారిపోయేరు. వరదాచారి లేచేందుకు ప్రయత్నం చెయ్యబోయేడు.

మహిషాసురుడిని చంపబోయే శక్తిలా వుంది నాంచారమ్మ. ఒళ్ళంతా వణుకుతోంది. ఆమె తన భర్తకేసి చూడలేదు. రత్తమ్మ వేపు చూస్తోంది మంత్ర ముగ్ధలా.

వరదాచారి ఏదో మాటాడబోయాడు.

"మీరు ఊరుకోండి" అంది నాంచారమ్మ. నాలుగు మూలలా చూసి ఒక చోట సదుపాయంగా ఉన్న చీపురు నందుకొని రత్తమ్మ మీద కలియబడింది. భర్త అడ్డుపడ్డా అతడ్ని పక్కకి నెట్టి ఎడాపెడా కొట్టింది రత్తమ్మని. తనేం చేస్తోందో తనకే తెలియని స్థితిలో ఉందామె.

రత్తమ్మకి దెబ్బలు లెక్కలోనివి కావు. నాంచారి రెండు కాళ్ళూ పట్టుకొని ఈ సంగతి తన మొగుడికి మాత్రం చెప్పొద్దని ప్రాధేయపడుతోంది.

నాంచారి ఆవేశం అంతా హరించి పోయేక శక్తి పూని వదిలిన మనిషిలా నిలబడి పోయింది.

ఆనక, వణుకుతూ నిల్చున్న వరదాచారి దగ్గరకు వెళ్ళింది. ఒక పురుగేదో వచ్చి అతడి కమీజు మీద వాలింది. ఆ పురుగును తీసిపారేసి, భర్త చేతులు తన చేతులలోకి తీసుకొంది. చిన్న గొంతుకతో అంది నాంచారమ్మ.

"పదండి మన ఇంటికి, ఊళ్లో వాళ్ళందరికీ కళ్ళు మనమీదే" అంది. తనకన్నీళ్ళు చీర చెంగుతో ఒత్తుకుంటూ ముక్కు ఎగపీలుస్తూ.

మర్నాటి నుంచీ యధా ప్రకారంగా నాంచారమ్మ గొంతు వినిపించక పోవడం వీధిలో నున్న వాళ్ళందరినీ ఆశ్చర్య సముద్రంలో ముంచింది. వీధికి కళ పూర్తిగా పోయినట్టుంది.

వరదాచారి ఇప్పుడు ముసి ముసి నవ్వులతో పలకరిస్తున్నాడు దారినపోయే వాళ్ళని.

*(1965 ఆగస్టు జ్యోతి నుంచి)*

రఘునాధరావుగారూ!
"మీచిరునామా ఏమి?
నిజము తెలుపుమా స్వామి!"
( -- సం॥)



*వృత్తిని నమ్మి, గౌరవించి, అన్యధా శరణం నాస్తిగా బ్రతికిన వో లాయరు, తన కుమార రత్నాన్ని కూడా లాయర్ చేసి, తొలిసారిగా అతను స్వయంగా కోర్టుకెళ్ళొచ్చిన నాటి సాయంకాలం, విశేషాలడిగేడు.*

*"ఆ దిక్కుమాలిన వీరాపురం జమీందారు ఆస్తి కేసు లేదూ; ఇవాళ యిద్దరు వారసులకీ రాజీచేసి సెటిల్ చేసేశా నాన్నా". అన్నాడు గర్వంగా పుత్రరత్నం.*

*"అయ్యో"! అని ముసలాయన ఈజీచెర్లో బాధపడ సాగాడు.*

*"అదేం నాన్నా?" అన్నాడు కొడుకు కంగారుగా.*

*"వెర్రి నాయనా. ఆ కేసుకాస్తా తగలేశావా! దాంతోనే కదరా నీకు బియ్యే నాలుగేళ్లూ బి.యల్. మూడేళ్ళూ చెప్పించేను!"*